ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

5

మంగళవారం 27 ఆగస్టు 2024





జయకృష్ణ.. ముకుందా

జిల్లావ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఏలూరులోని గోసంరక్షణ సమితి ప్రాంగణంలోని రాధాకృష్ణ మందిరంలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు.

స.హ.చట్టం బెదిరింపుల చుట్టం



- అధికారుల అక్రమాలపై వివరాల సేకరణకు ముఠా
- సమాచారం అడగ్గానే.. వీరితో రాయబేరాలు
- అడిగినంత సొమ్ములు ఇచ్చి గప్‌చుప్
- కొంత కాలానికి మళ్లీ చెలరేగిపోతున్నారు
- కొన్నిచోట్ల సమాచారం ఇచ్చేందుకు అధికారుల నిరాకరణ.. నిర్వీర్యమవుతున్న చట్టం

తాడేపల్లిగూడెం మండలంలోని పలు పంచాయతీల జమా ఖర్చుల వివరాలు తెలపాలని ఓ దళారి కార్యదర్శులకు దరఖాస్తు చేశాడు. ఆ సమాచారం ఇవ్వడం ఇష్టం లేకో, సమాచారం ఇస్తే తమ తప్పులు ఎక్కడ బయట పడతాయనో తెలియదు కానీ ఆ సమాచారం ఇవ్వకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు ఆ దళారితో బేరం పెట్టుకుని కొంత ముట్టజెప్పి కథ సుఖాంతం అయిందనుకున్నారు. కానీ అక్కడే మొదలైంది అసలు కథ. ఆ దళారి తన స్నేహితులతో అదే పనిగా స.హ. చట్టం ద్వారా దరఖాస్తు చేయించడం ఆ అధికారుల వద్ద వచ్చిన కాడికి దండుకోవడం పరిపాటిగా మారింది. ఈ వ్యవహారం ఎంత వరకూ వెళ్లిందంటే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పంచాయతీలే లక్ష్యంగా ఆ స్నేహితుల బృందం (ముఠా) ఇదే తరహాలో మాఫియాలా మారింది. ఇప్పుడు ఆ అధికారులు వారికి పెట్టిన పేరే స.హ.చట్టం ముఠా.

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 26 : సమాచార హక్కు చట్టానికి తూట్లు పడుతున్నాయి. పౌరుడు ఏదైనా ప్రభుత్వ శాఖలో అవినీతి జరిగిందని తెలుసుకోవడానికి, తనకు కావాల్సిన సమాచారం అధికారుల నుంచి పొందేందుకు చట్టపరంగా అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. మరి కొందరు అధికారులు చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని సమాచారం ఇవ్వకుండా తప్పించుకుంటున్నారు. ప్రభుత్వం నిష్పక్షపాతంగా ప్రభుత్వ శాఖల్లో సమాచారం ప్రతీ పౌరుడు తెలుసుకోవాలని ఏర్పాటు చేసిన చట్టం ఆచరణలో నిర్వీర్యమవుతోంది. దీనికి నిత్యం ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

చెప్పేందుకు నిరాకరణ

తాడేపల్లిగూడెం మండలంలోని ఒక ఆలయంలో ఉత్సవాలకు అధిక మొత్తంలో ఖర్చు చేశారని ఆరోపణలు రావడంతో దీనికి సంబంధించిన ఖర్చుల వివరాలు తెలియజేయాలని ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా దేవదాయ శాఖ అధికారులకు దరఖాస్తు చేశాడు. దాతల వివరాలు తెలిపేందుకు సమాచార హక్కు చట్టంలో వెసులుబాటు ఉంది. అయితే ఇది తమ శాఖ పరిధిలోకి రాదని సంబంధిత అధికారి బదులు ఇచ్చి, చేతులు దులుపుకున్నారు. స.హ. చట్టం ద్వారా తనకు కావాల్సిన సమాచారాన్ని తెలుసుకునేందుకు పౌరుడు తన ఆధార్ కార్డు ద్వారా సంబంధిత అధికారికి దరఖాస్తు చేసుకుంటే 28 రోజుల్లోగా సమాచారం అందించాలి. అక్కడ సమాచారం ఇవ్వకపోతే జిల్లా సమాచార అధికారిని సంప్రదించాలి. ఇక్కడా పరిష్కారం దొరకపోతే రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేయాలి. దీనిపై ఇక్కడ విచారణ జరిపి సంబంధిత అధికారికి జరిమానా విధిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి జరిమానాలు ఒక్కటి కూడా కనిపించలేదు. ఆలస్యమైన ఒక్కో రోజుకు రూ.250 చొప్పున జరిమానా విధించాలి. అప్పీలుకు వెళితే 30 రోజుల్లో పరిశీలనకు రావాల్సి ఉండగా నెలలు గడుస్తున్నా అలాంటి విచారణలే లేవు.

వివరాలు అడిగితే బెదిరింపులు

గత ప్రభుత్వ హయాంలో ఓ ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి జరిగిందని ఓ పౌరుడు స.హ.చట్టం ద్వారా వివరాలు అడిగాడు. అయితే సంబంధిత అధికారి ఈ సమాచారాన్ని వైసీపీ నేతకు ఇచ్చాడు. దీంతో సదరు నేత ఆ వ్యక్తిని ఫోన్‌లో బెదిరించడంతో ఆ పౌరుడు ఈ విషయంలో సైలెంట్ అయ్యాడు. ఈ తరహా ఘటనలు ఉమ్మడి పశ్చిమలో చాలానే చోటు చేసుకున్నాయి.

సిఫార్సు వుందా.. ఐతే ఓకే

ఉద్యోగుల బదిలీల్లో ఇదే కీలకం

పంచాయతీరాజ్‌లో ముగిసిన దరఖాస్తుల స్వీకరణ.. జడ్పీలో నేటితో ముగింపు



ఏలూరు సిటీ, ఆగస్టు 26: పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి పంచాయతీ, జడ్పీ, జడ్పీ ఇంజనీరింగ్ విభాగాల్లో ఉద్యోగుల బదిలీలను ఆయా శాఖల ఉన్నతాధికారులు నిర్వహిస్తున్నారు. ఒకేచోట ఐదేళ్ళ పనిచేస్తున్న వారితోపాటు మిగిలిన వారు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. జీరో సర్వీస్ నిబంధన ఏర్పాటు చేయడంతో పంచాయతీరాజ్ శాఖలోని వివిధ విభాగాల ఉద్యోగులందరికీ బదిలీ అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. అందువల్లే వారు కూడా తమకు నచ్చిన ప్రాంతానికి బదిలీ కావాలని దరఖాస్తులు చేసుకుంటున్నారు. గత ఐదేళ్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న వారు తమకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీలు కావాలని కోరుకుంటున్నారు. గతంతో పోలిస్తే అధిక సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి. ఈ బదిలీల ప్రక్రియలో ఎమ్మెల్యేలు, ఎంపీలు సిఫార్సు పత్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆయా ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలతో సన్నిహితంగా వున్న రాజకీయ నాయకులను కలిసి ఈ లేఖలను తీసుకుని మరీ దరఖాస్తులు చేస్తున్నారు.

నేటితో జడ్పీ దరఖాస్తుల ముగింపు

జడ్పీ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే ఈ జిల్లా నుంచి ఇతర జిల్లాలకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ముగియగా, ఈ జిల్లాలో ఒక ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియకు సంబంధించి ఈ నెల 27వ తేదీతో దరఖాస్తుల గడువు ముగియనుంది. ఉమ్మడి పశ్చిమలో జడ్పీకి సంబంధించి 48 మండలాలు, 238 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు (హైస్కూళ్లు), జిల్లా పరిషత్ కార్యాలయం, ఇంజనీరింగ్ కార్యాలయం ఉన్నాయి. జడ్పీ, మండల పరిషత్, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి ఎంపీ డీవోలు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, సూపరిటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్స్, మినిస్టీరియల్ సిబ్బంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ఈ ఉమ్మడి పశ్చిమ నుంచి ఇతర జిల్లాల కు బదిలీ కోసం 10 మంది ఎంపీడీవోలు దరఖాస్తు చేశారు. జడ్పీ ఉన్నత పాఠశాలలకు సంబంధించి నాన్ టీచింగ్ స్టాఫ్ అయిన రికార్డ్ అసిస్టెంట్లు, ల్యాబ్ అసిస్టెంట్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఈసారి దరఖాస్తులు అత్యధిక సంఖ్యలోనే వచ్చాయి. దరఖాస్తుకు గడువు ముగిసిన వెంటనే పరిశీలించి, బదిలీల ప్రక్రియ నిర్వహిస్తామని జడ్పీ సీఈవో సుబ్బారావు తెలిపారు.

పంచాయతీలకు ముగిసిన గడువు

పంచాయతీలకు సంబంధించి ఈ నెల 24తో దరఖాస్తుల గడువు ముగిసింది. అత్యధిక సంఖ్యలో కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి పశ్చిమలో 910 పంచాయతీలు, నాలుగు డీఎల్‌పీవో కార్యాలయాలు ఉన్నాయి. గ్రేడ్-1 నుంచి గ్రేడ్ 6 వరకు పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, జిల్లా పంచాయతీ కార్యాలయం, డీఎల్‌పీవో కార్యాలయాల్లో పనిచేసే ఏవోలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, స్వీపర్, అటెండర్లు బదిలీలు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఉండే ఈవోపీఆర్డీలు దరఖాస్తు చేశారు. పంచాయతీల్లో 406 మంది బదిలీలు కోరుతున్నారు. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో వివిధ రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఆశీస్సులతో పనిచేసే ఉద్యోగులకు ఈసారి బదిలీలు తప్పనిసరిగా జరగనున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధులతో సన్నిహితంగా మెలిగిన వారికే బదిలీలు తప్పవని తెలుస్తోంది. ఒకవేళ సాధారణ బదిలీల్లో వారికి అవకాశం లేకపోతే అడ్మినిస్ట్రేటివ్ నిబంధనల ప్రకారం వారిని బదిలీ చేసే అవకాశాలున్నాయి. దరఖాస్తుల గడువు ఈ నెల 24తో ముగిసిందని, రెండు నుంచి మూడు రోజులు దరఖాస్తుల పరిశీలన, 29, 30వ తేదీల్లో డ్రాఫ్ట్ లిస్ట్ విడుదల, 31న తుది బదిలీల జాబితా విడుదల అవుతుందని డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు.





పర్యాటకం.. పడకేసింది!

కొల్లేరుకు పూర్వకళ వచ్చేనా..!

దక్షిణాసియాలోనే పేరెన్నికగన్న మంచినీటి సరస్సు ఈ ప్రాంత వాసులకే కాకుండా ఇతర ప్రాంతాల వారికి పర్యాటకంగా మారనుందా..? ఈ సరస్సునే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వేల కుటుంబాలకు ప్రత్యా మ్నాయం ఉందా, లేదా? సరస్సులో పుష్కలంగా నీరు నిల్వ ఉండే పరిస్థితులు కూటమి ప్రభుత్వం సృష్టించగలదా..? ఈ సీజన్‌లోనే పనులన్నింటినీ ఆరంభించి పర్యాటకానికి కొత్త ఊపు, రూపు తేబోతుం దా.. అనేదే ప్రస్తుతం కొల్లేరువాసులు, పర్యాటక ప్రియుల ఆశ, ఆకాంక్ష.

- గడిచిన పదిహేనేళ్లల్లో ఎన్నో ప్రతిపాదనలు
- ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు
- ఇప్పటికే ఉన్న రిసార్టులు శిథిలం
- విదేశీ పక్షులను చూసేందుకు వచ్చే పర్యాటకులు అంతంత మాత్రమే
- కూటమి ప్రభుత్వంపై కొల్లేరు వాసులు ఎన్నో ఆశలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఒకప్పటి కొల్లేరు సరస్సు రూపురేఖలు మార్చడంలో అన్ని పార్టీల అనుకూలురు ఇప్పటివరకు తలోచేయి వేశారు. సరస్సునే నమ్ముకుని జీవనాధారం సాగిస్తున్న వేలాది మంది కుటుంబీకులు ఈ రోజుకాకపోతే రాబోయే రోజు అయినా తమ జీవితాలు మారక పోతాయా అనే ఆశతోనే ఇన్నాళ్లు బతుకీడ్చుకుంటూ వస్తున్నారు. రానురాను కొల్లేరు అందాలను చూసేవారి కంటే కొల్లేరును ఎలా ఆక్రమించాలో చూసేవారి సంఖ్య రెట్టింపు అయ్యింది. ఇదే సరస్సుకు గండంగా దాపురించింది. ఒకనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సుప్రీం అధికారిక కమిటీ సూచనలను తూచా తప్పకుండా పాటిస్తూ ఏకంగా 20 వేల ఎకరాలకు పైగా కబ్జా అయిన సరస్సు భూమిని తిరిగి కొల్లేరులో భాగమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఇదే సందర్భంలో కొల్లేరు సరస్సు పరీవాహం లోను, సరస్సులోను కేవలం సంప్రదాయ చేపల వేట మాత్రమే కొనసాగించాలని ఆంక్ష పెట్టారు. ఇది ఎలాగూ రోజువారీ బతుకీడ్చుకోవడానికి కొంత కలిసివస్తుంది కాబట్టి ఇంకోవైపు పర్యాటకాన్ని ప్రోత్సహిస్తే ఇక తిరుగుండదని 17 ఏళ్ల క్రితమే ఒక ఆలోచనకు రూపకల్పన జరిగింది. కొల్లేరు సరస్సు అంతర్భాగంలో బోటింగ్ ఏర్పాటు చేయడం, ఇంకో వైపు విదేశాల నుంచి వచ్చే పక్షులను తిలకించేందుకు పర్యాటకులకు అనువైన రిసార్ట్‌లు ఏర్పాటు చేయడం, రుచికరమైన ఆహార పదార్థాల విక్రయాలు విస్తరించేలా చేయడం ఆనాటి కార్యాచరణలో భాగమైంది. కొల్లేరు అంతర్జాతీయ స్థాయిలోనే పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోవాలని, దానికి ఎంత ఖర్చు అయినా పర్వాలేదని అప్పటి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం, ఆ తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం హామీలు కురిపించాయి. కాని వాస్తవానికి కొల్లేరును నమ్ముకుని బతుకుతున్న వేల మందికి సరైన ప్రత్యామ్నాయ జీవితం చూపించాలంటే పర్యాటక రంగం విస్తరించడం ఒకటే సరైనదని స్థానికులు భావించారు. ఇంకే ముంది కొల్లేరు ఒకటే కాదు ఉమ్మడి పశ్చిమలో పాపికొండలను కలుపుకుని పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుదామని పదేపదే పర్యాటక శాఖ ప్రతిపాదనలు రూపొందించింది కాని అవేవీ కార్యరూపం దాల్చలేదు.

కొల్లేరులో నీటి నిల్వ సంగతేంటి ?

కొల్లేరు సరస్సు అంతర్భాగంలో నీటి నిల్వ సామర్థ్యం ఏటా ఎగుడు దిగుడుగానే ఉంది. సరస్సులో ఒక్క వర్షాకాలం సీజన్‌లోనే దాదాపు మూడు టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని అధికారుల అంచనా. కారణం.. కొల్లేరు అంతర్భాగంలో సిల్టు పేరుకుపోవడం ఒక ఎత్తయితే, కిక్కిస దండెత్తడం ఇంకో కారణం. ఏడాదికి ఏడు నెలలు మాత్రమే కొల్లేరులో కొంత నీరు నిల్వ ఉండడం, ఆ తర్వాత ఐదు నెలలపాటు ఎడారిలా కనిపించడం సర్వసాధారణమైంది. దీంతో కొల్లేరు చాలాకాలం నుంచి దాని సహజ రూపాన్ని కోల్పోయింది. దీనిని దృష్టిలో పెట్టుకునే కొల్లేరులో నీటి కాలుష్యం తగ్గించేందుకు వివిధ డ్రెయిన్ల నీరు కలవకుండా నిరోధించడం, ఆ స్థానంలో మంచినీరు మాత్రమే పారేలా చూడడం వంటి ప్రతిపాదనలు తెర ముందుకు వచ్చాయి. పట్టిసీమ ప్రారంభమైన తర్వాత పోలవరం కుడి ప్రధాన కాల్వ ద్వారా కొంత గోదావరి నీటిని కొల్లేరుకు ఎందుకు తరలించకూడదని అప్పట్లో తర్జనభర్జన పడ్డారు. దీనికి ఏమాత్రం ఖర్చు కాకపోవడమే కాకుండా ప్రత్యేకించి నీటి నిల్వ పెరగడం, కొల్లేరు పరీవాహక ప్రాంతంలో భూగర్భ నీటి మట్టం మరింత పెరిగేందుకు దోహదపడుతుందని నిపుణులు సూచించారు. అయితే కొల్లేరులో ఈ నీరంతా నిల్వ ఉండాలంటే తొలుత ఆకివీడు సమీపాన ఒక రెగ్యులేటర్ కట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పరిరక్షించాలని ఇంకొందరు సూచించారు. ఆకివీడు వద్ద రెగ్యులేటర్ నిర్మించడం ద్వారా ఉప్పుటేరు నుంచి సముద్రపునీరు కొల్లేరులోకి ఎగబాకకుండా ఉంటుందని, ఉప్పునీటి సాంద్రత పరిసర ప్రాంతాల్లో మరింత పెరగకుండా జాగ్రత్త పడినట్టు అవుతుందని సూచించారు. అయితే ఈ ప్రతిపాదనలను ఇదిగో అదిగో అంటూనే గాలికొదిలేశారు. కొల్లేరును పర్యాటకంగా తీర్చిదిద్దాలన్న ప్రధాన అంశాలకు తోడు గడిచిన పదిహేనేళ్లుగా వివిధ అంశాలు చర్చకు వచ్చినా ఇవేవీ కార్యరూపం దాల్చలేదు. అభయారణ్యం అభివృద్ధిలో భాగంగా పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసి ఆ మేరకు పక్షుల రక్షణ కేంద్రాన్ని విస్తరించాలన్న ప్రతిపాదనను పెద్దగా పట్టించుకోలేదు. 2014 నుంచి 19 మధ్యన ఆటపాక వద్ద పర్యాటక కేంద్రాన్ని విస్తరించే ప్రయత్నం చేశారు. గుడివాకలంక సమీ పాన ప్రత్యేక రిసార్ట్ నిర్మించేందుకు ప్రభుత్వం సాహసించింది. ఇదంతా రానురాను వేరే రకంగా మారాయి. గుడివాకలంక రిసార్ట్ ఇప్పుడు ఎందుకూ కొరగాకుండా పోయింది. రిసార్టు భవనాలు కాస్తా మందుబాబులు సేద తీరేందుకే పరిమితమయ్యాయి. కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తామని పదేపదే ప్రకటనలు చేస్తోంది. ఉన్నంతలోనే ప్రభుత్వమే చొరవ తీసుకుంటే కొల్లేరును మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా రూపుదిద్దవచ్చని, తద్వారా తమ జీవనోపాధికి ఢోకా ఉండదని స్థానికులు భావిస్తున్నారు.

లంచం ఇస్తేనే సంతకం..!

- నగరపాలక సంస్థలో ఓ అధికారి అవినీతి దందా
- పనిని బట్టి వసూళ్లు..
- కిందిస్థాయి సిబ్బంది సైతం బెంబేలు



ఏలూరు టూటౌన్, ఆగస్టు 26 : నగర పాలక సంస్థలో అవినీతి రాజ్యమేలుతోందని, ఏ అధికారి చూసినా సొమ్ములు ఇస్తేనే పని చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కొత్తగా వచ్చిన ఓ అధికారి ప్రతి పనికి లంచం ఇచ్చిన తర్వాతే సంతకం పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన తీరుతో కింది స్థాయి సిబ్బంది లబోదిబోమంటున్నారు. నగర పాలక సంస్థలో పనిచేసే సిబ్బంది అందరికి జీతాల బిల్లులు చేయాల్సిందే ఆయననే. దీనిని అసరాగా తీసుకుని ఏదొక కొర్రీ పెట్టి జీతాల బిల్లులు సక్రమంగా చేయడం లేదని సిబ్బంది వాపోతున్నారు. అనారోగ్య కారణంతో సెలవు పెడితే శాంక్షన్ చేయించుకోవడానికి లంచం ఇవ్వాల్సిందే నంటూ సిబ్బంది వాపోతున్నారు. ఎవరైన ఉద్యోగి ఎరియర్ బిల్లు పెడితే దానికి, సప్లమెంటరీ బిల్లులు చేయాలన్న లంచం ఇవ్వకపోతే సంతకం పెట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఏదైనా పని ఉందని వెళ్లిన వారిని గంటల తరబడి ఆయన ఛాంబర్‌లో నిల్చొబెట్టడం.. ఆఖరికి రేపురా.. ఎల్లుండిరా.. అని తిప్పిపంపుతున్నట్టు సిబ్బంది వాపోతున్నారు. జీతాల బిల్లులే కాకుండా ఆ అధికారికి మరో మూడు బాధ్య తలు అప్పగించారు. టూటౌన్ ఏరియాలో పారి శుధ్య పర్యవేక్షణ ఆయనకే అప్పగించారు. కానీ ఏ రోజు పారిశుధ్య కార్మికులు ఎలా పని చేస్తున్నారో పర్యవేక్షించిన పాపాన పోలేదు. ఎందుకంటే ఆయన ఎక్కడో 25 కిలోమీటర్ల దూరంలోని వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఆయన ఇంటి నుంచి ఆఫీసుకు, ఆఫీసు నుంచి ఇంటికి తిరగడానికి రోజుకు నాలుగు సార్లు కారు డ్రైవర్ తిరగాల్సిందే. ఆ కారు నెల అద్దె, ఇంధనం అంతా కార్పొరే షన్ సొమ్మే. ఇక్కడ నివాసం ఉండక పోగా ఉదయం పారిశుధ్య పనులను కార్మికులతో చేయించే మేస్త్రీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ పెట్టి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని వాపోతున్నారు. అంతే కాకుండా ప్రతీ శానిటరీ ఇన్ స్పెక్టర్ ప్రతీ నెలా రూ.10 వేలు లంచం చెల్లించాలని హుకుం జారీ చేసి ఇలా 18 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నుంచి నెలకు రూ.లక్షా 80 వేలు ఆ అధికారి వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా పారిశుధ్య విభాగంలో కొంతమంది ఉద్యోగులతో పాటు మరికొంతమంది పర్మినెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది సైతం విధులు నిర్వర్తించకుండా బినామి కార్మికులతో పని చేయిస్తున్నారు. అలా పని చేయకుండా బినామి వర్కర్లను పెట్టిన వారు కూడా లంచాలు ఇవ్వాల్సిందే. సెక్రటరీ, ఇన్‌ఛార్జ్ డిప్యూటీ కమిషనర్ బదిలీపై కొన్నిరోజుల క్రితం వెళ్లిపోయారు. ఆ రెండు బాధ్యతలు కూడా ఈ అధికారికే అప్పగించారు. దీంతో రెవెన్యూ సెక్షన్‌లో సిబ్బందికి గుండెల్లో దడ మొదలైంది. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ భానుప్రతాప్ ఈ అధికారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నగరపాలక సిబ్బంది కోరుతున్నారు.

నేడు శ్రీవారి క్షేత్రంలో శ్రీకృష్ణ జయంతి



- ఆర్జిత కల్యాణం, ఆర్జిత సేవలు రద్దు
- 28న ఉట్ల పండుగ, గ్రామోత్సవం

ద్వారకాతిరుమల, ఆగస్టు 26: ప్రసిద్ధ క్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీకృష్ణజయంతి ఉత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో త్రినాథరావు తెలిపారు. అష్టమి మిగులు తిథితో పాటు రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగే ఈ ఉత్సవం నేపథ్యంలో స్వామివారికి నిత్యం నిర్వహించే ఆర్జిత కల్యాణం, నిత్యార్జిత సేవలను మంగళవారం రద్దు చేస్తున్నట్లు ఈవో వివరించారు. సాయంకాలం ఉత్సవం అనంతరం నివేదనాది కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే మరుసటిరోజైన బుధవారం సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో ఉట్ల పండుగ, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

వాసవీ ధామ్‌లో ప్రత్యేక పూజలు



పెనుగొండ, ఆగస్టు 26: పెనుగొండ శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్ నుంచి 15 మంది దంపతులు విచ్చేసి గోమాత పూజ , పంచామృత అభిషేకాలు, దంపతి పూజ, వాసవి హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



అరట్లకట్టలో పంజాబ్ రైతుల పర్యటన

పాలకొల్లు రూరల్, ఆగస్టు 26: మండలంలోని అరట్లకట్ట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగు విధానాన్ని పంజాబ్ నుంచి వచ్చిన రైతుల బృందం సోమవారం పరిశీలించింది. ప్రకృతి సాగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నూకరాజు ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టీకల్చర్ సీహెచ్ శ్రీనివాసులు, నేచురల్ ఫామింగ్ అధికారి చందు రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై వివరాలను తెలిపారు. ఈసందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగులో 9 విధానాలను వివరించారు. బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, కోడి గుడ్డు, నిమ్మరసం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, వంటి వాటిని ప్రదర్శనగా చూపించారు. అనంతరం రైతులకు స్వయం సహాయక సంఘ మహిళలతో ముఖాముఖీ చర్చలు నిర్వహించారు. అనంతరం కొమ్ముచిక్కాల, వాలమర్రు గ్రామాల్లో పర్యటించారు. వరిగట్లపై అరటి, కొబ్బరి, అనాస, మునగ, గోరు చిక్కుడు, ఆముదం, బెండ, వంగ టమోటా, మిర్చి, చామంతి, కంద, ఆకు కూరలు, ఆనప, బీర, పసుపు, జామ, వంటి పంటల సాగు విధానాలను పరిశీలించారు.

ఓపీఎస్ పునరుద్ధరణ చేసేవరకు పోరాడతాం

ఉద్యోగుల సర్వీస్ కాలమంతా దాచుకున్న వాటాను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకే యూపీఎస్‌ను తీసుకువచ్చినట్లుగా అర్థమవుతోందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సీపీఎస్‌ను రద్దుచేయాలని కోరుతున్న విషయాన్ని కేంద్రప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు.

దివ్యాంగ ఉద్యోగుల ఉమ్మడిజిల్లా కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గానికి ఎన్నికైన నాయకులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 26 : ఏపీ దివ్యాంగ ఉద్యోగుల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏలూరులో ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సీహెచ్.పార్థసారథి, ప్రధాన కార్యదర్శిగా వి.యుగం ధర్, కోశాధికారిగా ఆసిబాబును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా జె.ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా టి.రాము, సహ అధ్యక్షులుగా కె.దుర్గ, పి.పార్వతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.నాగేంద్రసింగ్, డి.శ్రీకాంత్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జ్యోతి, వెంకటేశ్వరరావు, జగదీష్, రాంబాబు, కృష్ణమూర్తి, డేవిడ్, గంగాధర్, ఆనంద్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ఎల్.విద్యాసాగర్, సీహెచ్.శ్రీనివాస్, ఎం.రాము, హరనాథ్, దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సతీష్ పాల్గొన్నారు.

17 మంది హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

ఏలూరు క్రైం, ఆగస్టు 26 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లల్లో సీనియార్టీని బట్టి 17 మందికి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సివిల్)గా పదోన్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సీనియార్టీని బట్టి పదోన్నతి కల్పిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్ళు

పేరు (నెంబర్)	పని చేస్తున్న ప్రాంతం
ఎండీ రాజా అహ్మద్ (హెచ్‌సీ 69)	ద్వారకాతిరుమల పీఎస్, అటాచ్డ్ సీసీఎస్ ఏలూరు
ఎం హరిశ్చంద్ర ప్రసాద్ (హెచ్‌సీ 1715)	ఏలూరు టూటౌన్
ఏవీఎస్ నారాయణరాజు (హెచ్‌సీ 1728)	డీఎస్పీ ఏలూరు
కె నాగభూషణం (హెచ్‌సీ 1729)	తూర్పుగోదావరి జిల్లా
ఇ శ్రీనివాస్ (హెచ్‌సీ 1731)	పశ్చిమ గోదావరి
ఎం భాస్కరరావు (హెచ్‌సీ 1732)	ఇంటిలిజెన్స్
కె శేషగిరిరావు (హెచ్‌సీ 1734)	పశ్చిమ గోదావరి జిల్లా
పి రాము (హెచ్‌సీ 1735)	డీసీఆర్బీ, ఏలూరు
ఎస్‌కె అమీర్ (హెచ్‌సీ 1736)	పెదవేగి పిఎస్ అటాచ్డ్ టు ద్వారకాతిరుమల పిఎస్
బి ఏసు (హెచ్‌సీ 1737)	ఏలూరు టూటౌన్ పీఎస్ అటాచ్డ్ టు ఏలూరు త్రి టౌన్ పీఎస్
డి వెంకటేశ్వరరావు (హెచ్‌సీ 1739)	ఇంటెలిజెన్స్
ఎన్ఎల్ నారాయణరావు (హెచ్‌సీ 1740)	డీటీసీ పెదవేగి
సీడి గోవిందబాబు (హెచ్‌సీ 1162)	పశ్చిమ గోదావరి
ఎస్ శ్రీనివాసరెడ్డి (హెచ్‌సీ 1741)	పశ్చిమ గోదావరి
పి. రామకృష్ణ (హెచ్‌సీ 1743)	తూర్పుగోదావరి జిల్లా
ఎ సత్యనారాయణ (హెచ్‌సీ 1745)	పశ్చిమ గోదావరి జిల్లా
సిహెచ్ సత్యనారాయణ (హెచ్‌సీ 1747)	పశ్చిమ గోదావరి జిల్లా

ప్రభుత్వాస్పత్రి పూర్తయ్యేనా..?

- వైసీపీ హయాంలో చేతులెత్తేసిన కాంట్రాక్టర్‌లు
- బిల్లుల మంజూరులో నాటి ప్రభుత్వం తాత్సారం.. అంచనాలు తల్లకిందులు
- బహుళ అంతస్థుల భవనాలు నిర్మించాలంటే భీమ్ వేయాల్సిందే
- తొలి విడత రూ. 10.15 కోట్లులో అధిక నిధులు భీమ్‌కే
- మళ్లీ రూ. 28 కోట్లు నాబార్డ్ నిధులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)





నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనం (ఇన్‌సెట్‌లో) తుప్పు పట్టిపోతున్న ఇనుము

భీమవరంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ.10.15 కోట్లు మంజూరయ్యాయి. తెలుగుదేశం ప్రభుత్వం హయాం 2018లోనే నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిపైనే నిర్మాణాలు చేపట్టాలని భావించారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రాధాన్యాలు మారిపోయాయి. భీమవరం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనంపై మరో అంతస్తు నిర్మాణానికి పనికిరాదని తేల్చారు. భీమవరం-గొల్లవాని తిప్ప రోడ్డులో భూమిని కేటాయించారు. ప్రభుత్వ ఆసుపత్రి నిధులను అక్కడకు మళ్లించారు. తీరా అక్కడ భూమి భవన నిర్మాణానికి అంత అనుకూలం కాదు. దాంతో 20 అడుగుల లోతు నుంచి భీమ్ వేసుకుంటూ వచ్చారు. కాస్త భవనం నిర్మాణం చేపట్టేప్పటికే నిధులు అయిపోయాయి. ఆసుపత్రికి మళ్లీ అదనపు నిధులు కావాల్సి వచ్చింది. అప్పట్లోనే నాబార్డ్ నుంచి మరో రూ.28 కోట్లు రప్పించారు. కొత్తగా టెండర్‌లు పిలిచారు. పాత కాంట్రాక్టర్ రాలేదు. కొత్త కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. అయినా వైసీపీ హయాంలో పనులు ప్రారంభించలేదు. ప్రభుత్వం నిధులు ఇస్తుందన్న గ్యారంటీలేకపోవడంతో పనులు నిర్మాణానికి కాంట్రాక్టర్ ఆసక్తి చూపలేదు.

రియల్ ఎస్టేట్ పేరుతో దోపిడీ

భీమవరం పట్టణానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో గొల్లవానితిప్ప రోడ్డు వైపు ప్రభుత్వ ఆసుపత్రిని కొత్తగా నిర్మించడానికి వైసీపీ హయాంలో భూములు కేటాయించడంపై అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి. రోడ్డుకు ఆనుకుని భూములు ఇవ్వలేదు. భీమవరం-గొల్లవాని తిప్ప రహదారికి కిలో మీటరు లోపల భూమిని కేటాయించారు. అక్కడ నిర్మాణం చేపట్టారు. గొల్లవానితిప్ప రహదారి నుంచి నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి వరకు మాత్రం రియల్ ఎస్టేట్ వెంచర్‌లు వెలిశాయి. ప్రభుత్వ ఆసుపత్రి పేరులో రియల్ దందా సాగింది. ఆసుపత్రి నిర్మాణం మాత్రం అలాగే నిలచిపోయింది. ఇప్పటికీ రెండో విడత పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ ఎన్నికల ముందు నిర్మాణం చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అదనపు భవనాల నిర్మాణం నిలిచిపోయింది. కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపలేదు. మధ్యలోనే పనులు ఆగిపోయాయి. భీమవరంలో రూ. 10.15 కోట్లతో పనులు పూర్తి చేసినా సరే ఫలితం లేకపోయింది. అక్కడ భూమి స్వభావాన్ని బట్టి 100 పడకల ఆసుపత్రిని నిర్మించాలంటే మరో రూ.28 కోట్లు అవసరం కానున్నాయని అంచనా వేశారు. నాబార్డు నుంచి నిధులను రప్పించారు. కొత్త కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాసరే పనులు ప్రారంభించలేదు. బిల్లుల సమస్యతోనే ఏజన్సీ చేతులెత్తేసింది.

ఏజన్సీతో సంప్రదింపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ పనులను పరిగణలోకి తీసుకున్నారు. కాంట్రాక్టర్లతో సంప్రదిస్తున్నారు. భీమవరంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కోసం కాంట్రాక్టర్‌తో చర్చలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు సైతం ఏజన్సీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవలే కాంట్రాక్టర్ ఆసుపత్రి ప్రాంతాన్ని సందర్శించారు. వర్షాభావంతో పనులు వాయిదా వేశారు. ప్రస్తుతం అక్కడ ఇసుక, చిప్స్ మాత్రమే దర్శనమిస్తున్నాయి. గతంలో ఉన్న ఇనుము తుప్పు పడుతోంది. పొడి వాతావరణం ఏర్పడితే పనులు ప్రారంభించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పనులు పురోగతి దిశగా పయనిస్తాయని ఆశిస్తున్నారు. అయితే ఆసుపత్రి పేరుతో మాత్రం అక్కడ పదుల ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్‌లు వెలిశాయి. అనుమతులు లేకుండానే వెంచర్‌లు వేశారు. అమ్మకానికి పెట్టారు. అందులో వైసీపీ నేత హస్తం కూడా ఉందన్న విమర్శలున్నాయి. ఆసుపత్రి నిర్మాణం పేరుతో రియల్ దందాపైనే వైసీపీ హయాంలో ఆసక్తి ఎక్కువగా కనిపించింది. బిల్లులు మంజూరులో తాత్సారం జరిగింది. దాంతో కొత్త పనులు పడకేశాయి. ఇప్పుడు మళ్లీ ఆశలు చిగురించాయి. ఏజన్సీ ప్రతినిధులు ముందుకొస్తున్నారు.

కుళాయిల్లో మురుగు నీరు

చోద్యం చూస్తున్న అధికారులు



కుళాయి నుంచి వస్తున్న మురుగు నీరు

ఆకివీడు, ఆగస్టు 26 : పదవవార్డులో నగర పంచాయతీ కుళాయిల ద్వారా తాగునీరుకు బదులు మురుగునీరు వస్తున్నది. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్ళినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై వార్డు కౌన్సిలర్ నేరెళ్ళ ప్రసన్న కూడా అనేక సార్లు సమావేశం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకున్నది. పట్టణంలో సుమారు 70ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు పాడైపోయి మురుగునీరు కలుస్తున్నది. దీంతో ఇరవై వార్డులలో తాగునీటి సమస్య ఉంది.

బాలిక మృతికి వైద్యులు కారకులైతే చర్యలు



పీహెచ్‌సీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీసీహెచ్ సూర్యనారాయణ, డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

ఆకివీడు, ఆగస్టు 26 : బాలిక మరణానికి సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది బాధ్యులైతే విచారణ అనంతరం చర్యలు చేపడతామని డీసీహెచ్ పి.సూర్యనారాయణ, డీఎంహెచ్‌వో డి.మహేశ్వరరావు అన్నారు. దుంపగడపకు చెందిన నిడమోలు దుర్గలహరి (16) తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా శనివారం స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకు వచ్చారు. బాలిక ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళాలని 108వాహనంలో పంపించారు. మార్గమధ్యలో బాలిక పరిస్థితి విషమించడంతో వాహనాన్ని వెనక్కి తిప్పించి ఆకివీడులో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళగా అప్పటికే బాలిక మృతి చెందిందని చెప్పిన సంగతి విదితమే. సీహెచ్‌సీ వైద్యులు నిర్లక్ష్యం కారణంగానే బాలిక మరణించిందని పలు పత్రికల్లో వచ్చిన వార్తలతో సోమవారం వైద్యాధికారులు సీహెచ్‌సీకి వచ్చి స్థానిక వైద్యులు, సిబ్బందితో మాట్లాడి విచారణ చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రికి ఇటువంటి మేజర్ ఇష్యూ వచ్చినప్పుడు డ్యూటీలో ఉన్న వైద్యులు చూసుకుంటారులే అనుకోకుండా వైద్యులందరూ కలిసికట్టుగా పనిచేసి సమస్యలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆసుపత్రిలో చిన్న చిన్న లోపాలున్నాయన్నారు. అంతే కాకుండా వైద్యులు, సిబ్బంది సూపరింటెండెంట్‌కు సహకరించడంలేదని అటువంటి వారిపై కూడా చర్యలు చేపడతామన్నారు.

వైసీపీ ప్రభుత్వ జీవోలన్నింటినీ రద్దుచేయాలి

ఏలూరు అర్బన్, ఆగస్టు 26 : విద్యావ్యవస్థకు సంబంధించి గత వైసీసీ ప్రభుత్వం జారీచేసిన జీవోలన్నింటినీ కూటమి ప్రభుత్వం రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని సోమవారం ఏలూరు టీడీపీ కార్యాలయంలో సమావేశమైన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ సీహెచ్.సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. సంఘ జిల్లాశాఖ తొలి సమావేశంలో ఎన్టీఏ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకట రమణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం జారీచేసిన అసంబద్ధ ఉత్తర్వుల కారణంగా విద్యావ్యవస్థ పూర్తిగా నాశనమైందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడటానికి జీవో 117 ఉత్తర్వులను రద్దుచేయాల్సిందేనని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల జీవో 84 ఉత్తర్వులను రద్దుచేయాలని, వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అప్‌గ్రేడేషన్ అయిన పాఠశాలలకు కొత్త పోస్టులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా ఆర్థిక కార్యదర్శిగా బి.రాము, ఉపాధ్యక్షుడిగా సీహెచ్.రఘుకుమార్, మహిళా కార్యదర్శిగా యు.శ్యామల, రాష్ట్ర కమిటీలోకి పి.రాహేలమ్మ, కార్యదర్శిగా టి.విజయానంద్, ఎంటీఎస్ జిల్లా కన్వీనర్‌గా టి.ఎడ్వర్డ్‌లను ఎన్నుకున్నారు. టీడీపీ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి యు.జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

30న యూటీఎఫ్ నిరసనలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 26 : సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్‌ను పునరుద్ధరణ చేయాల్సిన ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యుపిఎస్)పేరుతో తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 30న జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని యూటీఎఫ్ నాయకులు పి.వి.నరసింహారావు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సీపీఎస్ కంటే యూపీఎస్ మెరుగైన విధానమంటూ ప్రభుత్వం అంకెలగారడీ చేసిందని విమర్శించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల వాటాతో సంబంధంలేకుండా అన్నిరకాల సదుపాయాలుండే పాత పెన్షన్‌కంటే మరేదీ తమకు అంగీకారంకాదని తేల్చిచెప్పారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో పలువురి అరెస్టు

ద్వారకాతిరుమల, ఆగస్టు 26: భూతగాదాలో కుమారుడిపై ఇనుప రాడ్డుతో దాడి చేసిన తండ్రి అతని కుమార్తెలు, అల్లుళ్లు, వారి కుమారులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సుధీర్ తెలిపారు. కోడిగూడెం గ్రామానికి చెందిన దౌలూరి కాంతయ్యకు ఉన్న 4 ఎకరాల భూమి విషయమై అతని కుమారుడు ధర్మారావుకు కాంతయ్య కుమార్తెలు దాసరి శ్యామల, బంటుమిల్లి సుజాత మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో కాంతయ్య తన కుమారుడు ధర్మారావును హత్య చేయాలని నిర్ణయించుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో కాంతయ్య తన కుమార్తె దాసరి శ్యామల, అల్లుళ్లు దాసరి గంగరాజు, అతని కుమారులు వంశీ, సుందర్, చిన్నల్లుడు బంటుమిల్లి డేవిడ్‌లతో కలసి ఇనుప రాడ్లు, కత్తులతో దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన ధర్మారావు ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో ధర్మారావుపై హత్యాయత్నం చేసిన కాంతయ్య, ఇతరులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఆయన చెప్పారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

ఉంగుటూరు, ఆగస్టు 26: చేబ్రోలు-బాదంపూడి మధ్య చేబ్రోలు రైల్వే స్టేషన్ యార్డు వద్ద సోమవారం ఉదయం గుర్తు తెలియని 45-50 సంవత్సరాల వయసు గల మహిళ రైలు ఢీకొని మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జి.ఆర్.పి హెడ్ కానిస్టేబుల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. చనిపోయిన మహిళ లేత పసుపు రంగుపై తెలుపు పువ్వుల డిజైన్ టాప్ ఎరుపు రంగు ప్యాంటు చిరిగిన బ్లూ కలర్ చున్నీ ధరించిందని తెలిపారు. మృతదేహం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చూరిలో ఉంచినట్లు తెలిపారు. వివరాల కోసం 80191 57528, లేదా 99480 10061లో సంప్రదించాలని కోరారు.

డ్రై క్లీనింగ్‌షాప్‌లో అగ్నిప్రమాదం



భీమవరం క్రైం, ఆగస్టు 26 : పట్టణంలోని సుంకర పద్దయ్య వీధిలో బాలాజీ డ్రై క్లీనింగ్ షాపులో సంభవించిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.30 వేలు నష్టం ఏర్పడిందని ఫైర్ ఆఫీసర్ సీహెచ్ సూర్యప్రకాశరావు తెలిపారు. గ్రంధి వెంకట్రావుకు చెందిన బిల్డింగ్‌లో పి.బాలాజీ కొంత కాలంగా డ్రై క్లీనింగ్ షాపు నిర్వహిస్తున్నారు. అయితే ఆదివారం రాత్రి షాపులోపల పొగ వ్యాపించడంతో అందిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వెళ్ళి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నట్లు సూర్యప్రకాశరావు తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్ళిందని ఆత్మహత్యా యత్నం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 26: భార్య పుట్టింటికి వెళ్ళిందని మనస్థాపం చెంది భర్త ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. డైలీ కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్న నాగేంద్ర తన భార్య ప్రసన్నతో గొడవపెట్టుకోవడంతో ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో సోమవారం తన ఇంటివద్ద బ్లేడుతో చేతులపై కోసుకున్నాడు. రక్త స్రావంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళడంతో స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ఎనిమిది బైక్‌లు, రూ.15,800 నగదు స్వాధీనం

ద్వారకాతిరుమల, ఆగస్టు 26: ఐఎస్ జగన్నాథపురంలో కోడిపందేల స్థావరంపై ద్వారకాతిరుమల పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడుల్లో ఎనిమిది మోటార్ సైకిళ్లు, మూడు పుంజులు, రూ.15,800 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 12మంది పందెగాళ్లను అరెస్టు చేసినట్లు వివరించారు.

కాపర్‌వైర్ దొంగల ముఠా అరెస్టు

- 400 కేజీల కాపర్ స్వాధీనం..
- ఐదుగురి అరెస్టు



నిందితులను అరెస్టు చేసి విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిషోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 26 : పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను రాత్రి వేళ పగులగొట్టి అందులోని కాపర్‌వైరును అపహరించుకుపోయే ఒక ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిషోర్ ఆ ముఠా వివరాలను వెల్లడించారు. జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం పరిసర ప్రాంతాల్లో మొత్తం 40కిపైగా ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి అందులోని కాపర్ వైరును అపహరించుపోయారు. జీలుగుమిల్లి సీఐ బి వెంకటేశ్వరరావు, మరో సీఐ సీహెచ్ రాజశేఖర్, బుట్టాయిగూడెం ఎస్ఐ మల్లేశ్వరరావు, జీలుగుమిల్లి ఎస్ఐ నవీన్ వారి సిబ్బంది కలిసి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందంగా ఏర్పడి నిఘా పెట్టారు. బుట్టాయిగూడెం మండలం మర్లగూడెం గ్రామ సమీపంలో సోమవారం ఉదయం ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా మోటారుసైకిల్‌పై వెళ్తుండగా వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10 కేజీల కాపరువైరు, విద్యుత్ ట్రాన్స్‌పారాలను పగులగొట్టడానికి ఉపయోగించే వస్తువులు ఉండడాన్ని గమనించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ చేశారు. వీరంతా జీలుగుమిల్లిలో ఉంటూ చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించాలని వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్‌వైరును దొంగిలిస్తున్నారు. ప్రధాన నిందితులు అయిన జీలుగుమిల్లికి చెందిన గోపి కిరణ్ (25)ను అదుపులోకి తీసుకోగా అతనిపైన 19 కేసులు ఉన్నాయని గతంలో పీడీ యాక్టు కూడా ఉందని ఇటీవల తెలంగాణా రాష్ట్రంలో నమోదైన కేసులో 10 నెలల పాటు చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించి వచ్చినట్లుగా గుర్తించారు. జీలుగుమిల్లికి చెందిన పునుకుమాటి నరసింహారావు (38) గతంలో గోపాలపురం, నల్లజర్ల పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు ఉన్నాయన్నారు. జీలుగుమిల్లికి చెందిన షేక్ హుస్సేన్ (27) ఈ ముగ్గురు కలిసి తెలంగాణా రాష్ట్రం అశ్వరావుపేటనకు చెందిన తోట శ్రీనివాసరావు (58)కి విక్రయించే వారు. శ్రీనివాసరావు ఆ వైరును విజయవాడనకు చెందిన పదాతి సతీష్ కుమార్ (39)కు విక్రయించేవారు. నేరానికి పాల్పడిన ఆ ముగ్గురితో పాటు దొంగసొత్తు కొనుగోలు చేసిన శ్రీనివాసరావు, సతీష్ కుమార్‌లను కూడా అరెస్టు చేసినట్లు ఎస్పీ చెప్పారు. వీరి నుంచి రెండు లక్షల 40 వేల రూపాయల విలువైన 400 కేజీల కాపర్‌వైరు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు.

ఏటీఎం చోరీలో అన్నదమ్ములే నిందితులు!



నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

ముదినేపల్లి, ఆగస్టు 26 : ముదినేపల్లిలో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం చోరీకి యత్నించి పరారైన దుండగులను కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ పర్యవేక్షణలో ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. మండవల్లి మండలం పుట్ల చెరువు గ్రామానికి చెందిన సోదరులైన బెండి రామకృష్ణ, బెండి లక్ష్మీనారాయణలను సోమవారం ఉదయం ముదినేపల్లి - గుడివాడ ప్రధాన రహదారిలో కల్వపూడి సత్రం రోడ్డు వద్ద అరెస్టు చేసి చోరీకి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా ముందుంచారు. నిందితుడు రామకృష్ణ ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి సుమారు రూ. 3 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గంలేక ఏటీఎం చోరీని ఎంచుకుని, హైదరాబాద్‌లో ఉంటున్న తన అన్న లక్ష్మీనారాయణను రప్పించాడు. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి దాటాక లక్ష్మీనారాయణను ఏటీఎం బిల్డింగ్‌పై కాపలా పెట్టి రామకృష్ణ విద్యుత్ కనెక్షన్ తొలగించి ఏటీఎంను ధ్వంసం చేసి నగదు అపహరించేందుకు యత్నించిన సమయంలో అలారం మోగి పోలీసులు రావడంతో వారు పారిపోయారు. అప్పటి నుంచి వారి ఆచూకీ కోసం గాలించి సోమవారం అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. దుండగులను త్వరితగతిన పట్టుకోవటంలో నైపుణ్యం చూపించిన ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, కానిస్టేబుల్ బి.నాగబాబును ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, డిఎస్పీ శ్రావణ్ కుమార్ అభినందించారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

మొగల్తూరు, ఆగస్టు 26: మండలంలోని కొత్తోట గ్రామంలో అనధికారికంగా మట్టి తవ్వకాలను రెవెన్యూ అధికారులు సోమవారం నిలుపుదల చేశారు. గ్రామస్థుల నుంచి మట్టి అక్రమ రవాణాతో కలుగుతున్న ఇబ్బందులపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు వచ్చింది. దీంతో తహసీల్దార్ విద్యాపతి ఆదేశాలతో గ్రామంలో మట్టి తవ్వకాలను నిలుపుదల చేశామని, అధికారులు ఆదేశాలు లెక్కచేయకుంటే ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌లను సీజ్ చేస్తామని ఆగ్రామ వీఆర్వోలు శ్యామ్యూల్ రాజు, మహలక్ష్మీ హెచ్చరించారు.

అత్తింటి వేధింపులతోనే కార్తీక్ మరణం

దళిత నాయకుల ఆరోపణ

ఏలూరు క్రైం, ఆగస్టు 26 : భార్యతోపాటు అత్తింటివారు మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేయడం వల్లే న్యాయవాది పయనం కార్తీక్ అనారోగ్యానికి గురై మరణించాడని దళిత నాయకులు, న్యాయవాదులు, కార్తీక్ తల్లి దండ్రులు ఆరోపించారు. ఏలూరు శంకరమఠం వీధిలోని కార్తీక్ పెద్ద కర్మ కార్యక్రమం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైకోర్టు న్యాయవాది వి ఉదయ్‌కుమార్, ఎస్సీఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు సబవరాజు, ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాది జీపీ డానియేల్, ఎంఆర్‌పీఎస్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, కార్తీక్ తండ్రి రత్నరాజు మీడియాతో మాట్లాడారు. ఏలూరులోని శంకరమఠం వీధిలో రాజూస్ ఐఎస్ అకాడమి కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న న్యాయవాది పయనం రత్నరాజు గతంలో హైదరాబాద్‌లో ఉండంగా అతని పెద్ద కుమారుడు అయిన పయనం కార్తీక్ హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరినకు చెందిన మనిషా ప్రియా యాదవ్ అనేక యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆరేళ్ళపాటు సజావుగా కాపురం చేశారు. మనిషా ప్రియా యాదవ్ తండ్రి మరణించడంతో ఆమెను హైదరాబాద్ పంపించారు. ఆతరువాత ఆమె అప్పటి నుంచి తిరిగి రాలేదని ఆమెతో పాటు అత్తింటివారు శారీరకంగా, మానసికంగా కార్తీక్‌ను వేధించారని అంతేకాకుండా హైదరాబాద్‌లో వరకట్న వేధింపుల కేసు పెట్టి జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయించి ఏలూరు టూటౌన్ పోలీసులకు రిఫర్ చేయించారన్నారు. పోలీసులు దర్యాప్తులో వైఫల్యం చెందారని ఆరోపించారు. వారు వేధింపులు భరించలేక కార్తీక్ అనారోగ్యానికి గురై ఈనెల 14వ తేదీన మృతి చెందాడన్నారు.

ఏలూరులో చైన్ స్నాచింగ్

ఏలూరు క్రైం, ఆగస్టు 26 : దేవాలయానికి వెళ్ళి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వెనుక నుంచి వచ్చి ఒక మహిళ మెడలోని బంగారపు గొలుసును తెంపుకుని ఆమెను తోసివేసి పారిపోయారు. ఏలూరు తూర్పు వీధికి చెందిన మద్దు జ్వాల (53) సోమవారం రాత్రి శ్రీ కృష్ణామి సందర్భంగా వేణుగోపాలస్వామి గుడికి వెళ్ళి తిరిగి తన ఇంటికి నడిచి వెళ్తుండగా ఇంటి సమీపానికి వెళ్ళే సరికి వెనుక నుంచి ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో మూడు కాసుల బంగారపు చైన్‌ను తెంపుకుని ఆమెను తోసి వేశారు. వెంటనే పరారీ అయ్యారు. గోడ తలకు తగలడంతో గాయాలపాలైన ఆమెను ఒక ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

రహదారి భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు క్రైం, ఆగస్టు 26: రోడ్డు సేఫ్టీ మొబైల్ పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ అన్నారు. 16వ నెంబర్ జాతీయ రహదారిపై రోడ్డు సేఫ్టీ మొబైల్ టీం సిబ్బందితో సోమవారం డీఎస్పీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు అరికట్టాలని, ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించాలన్నారు. రహదారిపై దోపిడీ, దొంగతనాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నేరస్తులను పట్టుకోవాలన్నారు. రహదారిపై వాహనాలు పార్కింగ్ చేయకుండా డ్రైవర్లకు అవగాహన కల్పించాలని, మరమ్మతులకు గురైన వాహనం ఉంటే హైవే అథారిటీ సహకారంతో అక్కడ నుంచి తరలించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు, త్రీ టౌన్ ఎస్ఐ ఫణీంద్ర, పాల్గొన్నారు.

వేగంగా లారీలు నడిపితే కఠిన చర్యలు : డీఎస్పీ


టిప్పర్ డ్రైవర్లకు సూచనలిస్తున్న డీఎస్పీ

కుక్కునూరు, ఆగస్టు 26: ఇబ్రహీంపేట ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు లోడింగ్ కోసం వచ్చే లారీడ్రైవర్లకు పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు పలు సూచనలు చేశారు. సోమవారం లారీ డ్రైవర్లతో మాట్లాడారు. వాహనాలను జాగ్రత్తగా నడపాలని, రహదారిపై ప్రయాణించే వారికి ఇబ్బందులు కలగకుండా నెమ్మదిగా వెళ్లాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా, వేగంగా లారీలను నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌లో విజిలెన్స్ విచారణ

కుక్కునూరు: ఇబ్రహీంపేట ఇసుకరీచ్‌లో సోమవారం విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రైవేటు సంస్థ నిబంధనలు ఉల్లంఘించి ఇసుక దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక రీచ్‌లలో విచారణ జరుపుతున్నారు. ఇబ్రహీంపేటలో జరిగిన ఇసుక తవ్వకాలు, పక్కనే భారీగా ఉన్న ఇసుక నిల్వలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇబ్రహీంపేట ఇసుక సొసైటీ సభ్యులతో మాట్లాడినట్లు సమాచారం. ప్రైవేట్ సంస్థ చేపట్టిన ఇసుక అమ్మకాలు, రికార్డులను పరిశీలించినట్లు తెలిసింది.


ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు, ఉపాధ్యాయులు

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ఏలూరు రూరల్, ఆగస్టు 26: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏ.ఎస్.ఆర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. డీఎస్‌వో డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉందన్నారు. క్రీడలవల్ల శారీరకదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. ధ్యాన్‌చంద్ హాకీక్రీడాకారుడిగా మన దేశం పేరును దశదిశలా వ్యాపింప చేశాడని, ఆయన పుట్టిన రోజున జాతీయ క్రీడా దినోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ ఎమ్డీ సిరిఉద్దీన్, కృష్ణకుమారి, ఇతర కోచ్‌లు మోహన రవికుమార్, ఎస్.కె కాశీం, గణేశ్, కె.శివ, ఏఎస్ఆర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

1న ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాలకు శిక్షణ


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు రూరల్, ఆగస్టు 26: ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల రాజకీయ తరగతులు సెప్టెంబర్ 1న జరుగుతాయని నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు తెలిపారు. మార్కెట్‌యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం డి.వీరినాయుడు అధ్యక్షతన సోమవారం జరిగింది. దేశంలో కార్మికవర్గంపై కేంద్ర, రాష్ట్రాలు పెనుదాడులు చేస్తున్న నేపథ్యంలో చట్టాలు అమలు కాకుండా కార్మిక హక్కులు హరించేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మికుల గొంతు కోసే చట్టాలను తీసుకువచ్చిన కేంద్ర విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని చైతన్యం చేయాలనే సంఘటిత, అసంఘటిత కార్మికులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్మిక వర్గాన్ని విస్మరించే కేంద్ర, రాష్ట్రాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం చైతన్యవంతం కావాలనే ఉద్దేశంతో క్లాసులు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పొలారి, సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ పాల్గొంటారన్నారు. సమావేశంలో జి.రమణ, పండు, సింహాచలం, భూపతి, ఎస్.అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్ల నిర్మాణ బిల్లులు చెల్లించాలి


మాటాడుతున్న జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ఉంగుటూరు, ఆగస్టు 26: పాడి రైతులకు మినీ గోకులం షెడ్ల నిర్మాణ బిల్లులు చెల్లించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేసారు. మండలంలోని ఎ.గోకవరంలో సోమవారం పాడి రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ గోకులం షెడ్డు పథకంలో పాడి రైతులకు 90శాతం సబ్సిడీ బకాయిలు చెల్లించాలన్నారు. బిల్లులు అందక పోవడంతో గత ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని వేలాది మంది రైతులకు బిల్లులు చెల్లించాన్నారు. ధాన్యం బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో గుత్తికొండ వెంకట కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, తమ్మినీడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


పామాయిల్ పరిశ్రమను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

పామాయిల్ గిట్టుబాటు ధరకోసం కృషి : ఎమ్మెల్యే బాలరాజు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 26: పామాయిల్ పంటకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా కృషి చేస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. నవభారత్ పామాయిల్ పరిశ్రమను సోమవారం ఆయన సందర్శించారు. పామాయిల్ తయారీ, పామాయిల్ క్రషింగ్, ఆయిల్ రిఫైనరి గురించి పరిశ్రమ డీజీఎం యార్లగడ్డ రాజగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. జీలుగుమిల్లి, పోలవరం, బుట్టాయగూడెం, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల పామాయిల్ రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవీ. రాఘవరావు, సీనియర్ ప్లాంట్ మేనేజర్ పెండ్యాల శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇన్‌చార్జి రంగారావు తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు రామకోటి ఆవరణలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలలో అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, పోలవరంలో ఉట్టికొడుతున్న బాలలు

కృష్ణాష్టమి వేడుక

• ఆలయాల్లో పూజలు • ఉట్టి కొట్టిన యువత


ఏలూరులో పూజలు చేస్తున్న ఎంపీ మహేశ్, ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్ / కార్పొరేషన్ / రూరల్, ఆగస్టు 26: ఏలూరు నగరం, గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకగా నిర్వహించారు. ఆలయాల్లో సోమవారం పూజలు చేశారు. సాయంత్రం యువత ఉట్టి కొట్టి సందడి చేశారు. రామచంద్రరావుపేట గోసంరక్షణ సమితి ప్రాంగణంలో రాధాకృష్ణ మందిరం వద్ద రాధాకృష్ణుల వారికి క్షీరాభిషేకం, తులసీపూజ చేశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎనిమిదేళ్లలోపు పిల్లలకు బాల గోపాల వేషధారణ పోటీలు నిర్వహించారు. అశోక్‌నగర్‌లో విశ్రాంత వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు జరిపారు. అమీనాపేట ఏటిగట్టు వద్ద యాదవసంఘ భవనంలో, యాదవ్‌నగర్ శ్రీకృష్ణ ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రామకోటి ప్రాంగణంలో యాదవ సంఘం, ఇస్కాన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే బడేటి చంటి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారుల వేషధారణ అలరించాయి. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ముమ్మిడి చింతయ్య యాదవ్, ఇనుకపల్లి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: కొత్తూరు, గుడిపాడు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణ చైతన్య యాదవ సంఘం, గ్రామ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుడికి పూజలు నిర్వహించి గ్రామంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. తీన్‌మార్ డప్పువాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించగా, కృష్ణుడి వేషధారణలో బాలబాలికలు ఉట్టి కొట్టి సందడి చేశారు.

● భీమడోలు: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ, పోలసానపల్లి, కురేళ్ళగూడెం, అంబర్‌పేట తదితర గ్రామాల్లో శ్రీకృష్ణుడిని సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. గుండుగొలనులో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వేడుకలు ప్రారంభించి ఉట్టి కొట్టారు.

● కామవరపుకోట: శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుని ప్రతిమకు అభిషేకాలు, అర్చనలు చేశారు. పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. లలితాదేవి సన్నిధిలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.

● ఉంగుటూరు: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కృష్ణాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు, గీతా పారాయణం చేశారు. కైకరం పడమటిపేట, నారాయణపురంలోని కృష్ణాలయం, ఉంగుటూరు, చేబ్రోలు, బాదంపూడి గ్రామాలలో పూజలు చేసి చిన్నారులను కృష్ణుడి వేషధారణలో అలంకరించారు. ఉట్టి కొట్టిన విజేతలకు బహుమతులు అందజేశారు.

● జంగారెడ్డిగూడెం: మన సంస్కృతి, సంప్రదాయాలను నేటి విద్యార్థులు తెలుసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు సూచించారు. కళాశాల ఆవరణలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థి ఎస్.తేజ ప్రథమ బహుమతి సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బాలగోకులం పేరిట శ్రీకృష్ణుని వస్త్రధారణ పోటీలు నిర్వహించారు.

● కుక్కునూరు: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో పలుచోట్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుక్కునూరులోని ప్రైవేటు


గుండుగొలనులో ఉట్టికొడుతున్న గన్ని వీరాంజనేయులు

స్కూల్‌లో చిన్నారులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కుక్కునూరులోని కిష్టారం కాలనీలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కృష్ణుడికి పూజలు నిర్వహించి అనంతరం యాదవ యువకులు ఉత్సాహంగా ఉట్టికొట్టారు.

● పోలవరం: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ప్రగడపల్లి, ఎల్ఎన్‌డీపేట, వింజరం పంచాయతీలలో బాలలు ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరంలో బెస్తావీధి, కొత్తపేట, నూతనగూడెం, పాతపోలవరంలో ఉట్టి కొట్టి సందడి చేశారు.

● జీలుగుమిల్లి: కృష్ణాష్టమి వేడుక పురస్కరించుకుని మండలంలో పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. జీలుగుమిల్లి వినాయక ఆలయం వద్ద, వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రం, తాటియాకుల గూడెం, పి.అంకంపాలెం, ఉదయ్‌భాస్కర్ కాలనీలో ఉత్సాహంగా ఉట్టి కొట్టారు.

● చింతలపూడి: చింతలపూడి పరిసరాలలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయాల్లో, గృహాల్లో పూజలు జరిపి కృష్ణుడికి ఇష్టమైన నైవేద్యాలు పెట్టారు. వెలంపేట, కొప్పూరుగూడెం, కొప్పులవారివీధి, వెలంపేట కాలనీలలో ఉట్టి కొట్టే వేడుకలు నిర్వహించారు.

● పెదవేగి: కృష్ణ భగవానుడు గీతోపదేశంతో సర్వమానవాళికి మార్గ నిర్దేశం చేశారని ముండూరు యాజ్ఞవల్క్య రాజాశ్రమం పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానంద భారతిస్వామి అన్నారు. ఆశ్రమంలో షోడశ పూజలు, వేదాంత సభలు నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల్లో కృష్ణా ష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణ మందిరం, గ్రామ కూడలిలో యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టి బహుమతులు అందుకున్నారు.


జీలుగుమిల్లిలో ఉట్టి సందడి, ఏలూరు గోసంరక్షణ సమితిలో రాధాకృష్ణులు, అశోక్‌నగర్‌లో శ్రీకృష్ణుడు, ఉట్టికొడుతున్న యువకుడు, జంగారెడ్డిగూడెంలో శ్రీకృష్ణుని వేషధారణ పోటీల్లో బాలబాలికలు

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న జీవరత్నం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 26: మండలంలోని ప్రభుత్వ పోరంబోకు, ల్యాండ్ సీలింగ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో అందుగుల ప్రభాకరరావు అధ్యక్షతన సోమవారం మండల కమిటీ సమావేశం జరిగింది. జీవరత్నం మాట్లాడుతూ పంగిడిగూడెం, గురవాయిగూడెం, కేతవరం, పట్టెన్నపాలెం, ఎ.పోలవరం, తాడువాయి, వేగవరం, చక్రదేవరపల్లి గ్రామాలలో ప్రభుత్వ పోరంబోకు, ల్యాండ్ సీలింగ్ భూములు, ఎర్రకాలువ మిగులు భూములు సర్వే చేసి పేదలకు పంపిణీ చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రైతుల పొలాల్లో పనిచేసే విధంగా చేసిన ప్రతిపాదనలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి పనులు 200 రోజులకు పెంచి రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. సభ్యులు సూర్య కిరణ్, సీత, బి.రాంబాబు, జి.రాంబాబు, ఆనందరావు పాల్గొన్నారు.

ప్రాణదాన ట్రస్ట్‌కు మందులు అందజేత


మందులు అందజేస్తున్న దాత

ద్వారకాతిరుమల, ఆగస్టు 26: చినవెంకన్న దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాణదాన ట్రస్టుకు దాత 2వేల మంది భక్తులకు సరిపడా మందులను అందజేశారు. తెనాలికి చెందిన ఏవీ సాంబశివరావు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. క్షేత్రానికి పాదయాత్రగా వచ్చే భక్తుల కోసం వైద్యుడు రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు.

పది, ఇంటర్ ప్రతిభావంతులకు సత్కారం

ఉంగుటూరు, ఆగస్టు 26 : పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన కైకరం విద్యార్థులను రంగా యువసేన సత్కరించింది. గ్రామానికి చెందిన మనుమంతు అజయ్‌రాజు ఇంటర్మీడియట్ (నారాయణపురం జూనియర్ కళాశాల)లో రాష్ట్ర స్థాయి ద్వితీయ ర్యాంకు సాధించగా కైకరం హైస్కూలులో పదో తరగతి విద్యార్థిని శానం నందిని ప్రియ జిల్లా సెకండ్ ర్యాంకు సాధించింది. వారికి గౌరవాధ్యక్షులు వెజ్జు సుబ్బారావు రూ.10 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకరం అందించారు. రంగా యువసేన దుశ్శాలువా పూల మాలలతో సత్కరించారు. శానం పెదబాబు, గంటా శ్రీరామమూర్తి, అద్దేపల్లి శేషయ్య, పుప్పాల గోపి, మట్టా మురళి, తదితరులు పాల్గొన్నారు.


సెయింట్ జాన్స్ కాలేజీలో జ్ఞాపిక అందిస్తున్న పొలిమేర జయరావు

ఆధ్యాత్మిక చింతన, విద్యా వ్యాప్తి చేయాలి

దెందులూరు, ఆగస్టు 26: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, సేవా గుణంతో విద్యావ్యాప్తికి కృషి చేయాలని ఆర్‌సీఎం పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. సోమవరప్పాడు సెయింట్ జాన్స్ బీఈడీ కాలేజీ ప్రారంభించి 25 ఏళ్ల పూర్తి కావడంతో డాక్టర్ ఫాదర్ బాల ఆధ్వర్యంలో సోమవారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. సెయింట్ జాన్స్ కాలేజీ ద్వారా ఎంతో మంది విద్యార్థులకు మంచి భవిష్యత్ కల్పించామని కరస్పాండెట్ ఫాదర్ బాల అన్నారు. చార్లీస్, మోజెస్, ఇమ్మానియేల్, మైఖేల్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అనంతరం కాలేజీ ఆవరణలో బిషప్ పొలిమేర జయరావు, ఫాదర్ బాల ఆధ్వర్యంలో దివ్య పూజా బలి అర్పించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 26: చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మత్స్యశాఖాధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ కార్యాలయంలో అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కొల్లేరు, గోదావరి చేపలకు జాతీయ స్థాయిలో మార్కెట్ ఉందన్నారు. కొల్లేరు బ్రాండ్ ఇమేజ్‌ని తగ్గించాలని చూస్తే సహించేది లేదన్నారు. పర్యావరణానికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీడీ నాగలింగాచారి, ఏడీలు నరసయ్య రాజ్‌కుమార్, అధికారి దివ్య, పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పనులపై సమావేశం

భీమడోలు, ఆగస్టు 26: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా భీమడోలు మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో మంగళవారం గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నాలని సూచించారు. వచ్చే నెల 5వ తేదీ వరకూ మండలంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీలు నిర్వహించడానికి సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

చింతలపూడి సీఐ రవీంద్ర నాయక్ బాధ్యతల స్వీకరణ

చింతలపూడి, ఆగస్టు 26: చింతలపూడి సీఐగా రవీంద్ర నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజల సహకారంతో శాంతి భద్రతలను పరిరక్షిస్తామన్నారు. గంజాయి ప్రభావం ఉన్నందున దీనిపై దృష్టి పెడతానన్నారు. ఆయన విజయవాడ నుండి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఏలూరు, కాకినాడ, చింతలపూడిలో పనిచేశారు.

బహుజన సేన కోఆర్డినేటర్‌గా బాజీ

ఏలూరు టూటౌన్, ఆగస్టు 26: బహుజన సేన రాష్ట్ర కోఆర్డినేటర్‌గా షేక్ సయ్యద్‌బాజీ నియమితులయ్యారు. బహుజన సేన కార్యాలయంలో సోమవారం వ్యవస్థాపక అధ్యక్షుడు మత్తే బాబి నియామకపత్రాన్ని అందజేశారు.

సౌభాగ్యలక్ష్మి ఆలయంలో శిఖర కుంభాభిషేకం

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 26: సత్రంపాడు సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం శిఖర కుంభాభిషేకం, హోమాలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణతో దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు మహా అన్నప్రసాద వితరణను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఊటుకూరి సాయిబాబా శర్మ భక్తులతో పూజలు చేయించారు.


రాజుపేటలో సీసీ డ్రెయిన్ మధ్యలో విద్యుత్ స్తంభం

డ్రెయిన్‌లో విద్యుత్ స్తంభం!

మురుగు పారేదెలా..!

పెదపాడు, ఆగస్టు 26: మురుగునీరు సక్రమంగా ముందుకు కదలాలంటే ఎటువంటి అడ్డంకులు లేకుండా ఉండాలి. మరి ఇక్కడెమో విద్యుత్ స్తంభమే సీసీ డ్రెయిన్ మధ్యలో ఉంది. మరి మురుగు నీరెలా కదులుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పెదపాడు మండలం రాజుపేటలో ప్రధాన రహదారికి ఆనుకుని వున్న సీసీ డ్రెయినేజీ మధ్యలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. సాధారణ రోజుల్లో ఇబ్బంది తలెత్తకపోయినా వర్షాకాలంలో మురుగునీరు పారుదలకు ఆటంకం కలిగి డ్రెయిన్ పొంగుతుందని, డ్రెయినేజీలో వున్న అడ్డంకిని తొలగించాలని విద్యుత్శాఖ అధికారులను కోరుతున్నారు.


ఏలూరులో రెడ్‌క్రాస్, పరివర్తన్ దివ్యాంగుల సొసైటీ, పోలవరంలో మదర్ థెరిసా చిత్రపటం, విగ్రహాలకు విద్యార్థులు, కమిటీ నివాళి

మదర్ థెరిసా సేవలు యువతకు స్ఫూర్తి

ఏలూరు రూరల్, ఆగస్టు 26: మదర్ థెరిసా సేవలు యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. దొండపాడు పరివర్తన్ దివ్యాంగుల పాఠశాలలో ప్రిన్సిపాల్ దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ సహకారంతో సోమవారం మదర్ థెరిసా జయంతి నిర్వహించారు. పీవీ రమణ మాట్లాడుతూ సేవకు ప్రతిరూపం మదర్ థెరిసా అన్నారు. ఇతర దేశంలో పుట్టిన జీవితకాలం భారతదేశంలో సేవలు అందించిన గొప్ప మానవతా మూర్తి అని కొనియాడారు. తొలుత మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పరివర్తన్ పాఠశాలకు నిత్యావసరాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ చైర్మన్ హేమసుందర్, పరివర్తన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: మదర్ థెరిసా జయంతి వేడుకలను రెడ్‌క్రాస్ సొసైటీ వద్ద ఘనంగా నిర్వహించారు. అమ్మ స్వచ్ఛంద సేవా సమితి, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మదర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాతా శిశు విభాగంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు రొట్టెలు పంపిణీ చేశారు. అమ్మ సేవా సమితి అధ్యక్షుడు ఈఎన్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మదర్ థెరిసా ఎంతో మందికి సేవలందించి ప్రపంచానికి అమ్మగా పేరు గాంచారన్నారు. రెడ్‌క్రాస్ వలంటీర్లు, అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి విజయనరసింహరావు, ఇళ్ళ వర ప్రసాద్, పాండురంగారావు, గోవిందరాజు, సుబ్రమణ్యం, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పోలవరం, ఆగస్టు 26: విశ్వమాత మదర్ థెరిసా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని షేక్ షెహిన్షా బాషా అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మదర్ విగ్రహానికి సేవా కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదర్ థెరిసా సేవా కమిటీ ద్వారా సమాజ సేవ చేస్తున్నామన్నారు. మదర్ థెరిసా ప్రపంచంలో ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నారన్నారు. ఆసుపత్రిలో రోగులకు పాలు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా కమిటీ సభ్యులు పఠాన్ ఖాజా, సుధాకర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: మదర్ థెరిసా తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ మాడా వెంకటేశ్వరరావు అన్నారు. మదర్ థెరిసా జయంతి వేడుకలను గురుకుల విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మదర్ థెరిస్సా జీవితం చరమాంకం వరకు ప్రజాసేవలోనే గడిపారన్నారు. ఆమె అందరికీ తల్లి అని, ఆమె చేసిన సేవలో అందరూ తల్లిని చూసేవారన్నారు. ప్రతి ఒక్కరూ ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని, అలాంటి వారి జీవితం పరిపూర్ణమవుతుందని ఆయన తెలిపారు. తొలుత విద్యార్థులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జాలిపూడిలో గోతులు పడిన రోడ్డు

గుంతల రహదారిపై ఇక్కట్లు

ఏలూరు రూరల్, ఆగస్టు 25: ఏలూరు రూరల్ మండలంలోని జాలిపూడి రహదారిపై మోకాలి లోతు గుంతలు పడ్డాయి. ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ప్రతిరోజూ జాలిపూడి, కాట్లంపూడి గ్రామాల నుంచి వాహనదారులు మెయిన్‌రోడ్డుకు రావాల్సి ఉంది. రోడ్డుపై భారీ గుంతలు ఉండడంతో చాలామంది ప్రమాదం బారిన పడ్డారు. గ్రామానికి లోపలకు వెళ్లాలంటే రెండు కిలో మీటర్లు సుమారు అర్థగంట పడుతుంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారు నిర్మాణాన్ని పట్టించుకోలేదు. మరమ్మతులు చేసి రోడ్లను గాలికి వదిలేసింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు ఛిద్రమై పెద్ద గోతులు పడ్డాయి. అధికారులు పట్టనట్లు వ్యవహరించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కైకలూరులో శ్రీకృష్ణునికి పూజలు చేస్తున్న భక్తులు


మండవల్లిలో యువకుల కేరింతల మధ్య గ్రామోత్సవం


కలిదిండిలో రథంపై శ్రీకృష్ణుడి ఊరేగింపు


చాట్రాయిలో రాధాకృష్ణుల వేషధారణలు

గిరిహర.. మురహర.. రాధామనోహరా..

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి.. వైభవంగా గ్రామోత్సవాలు.. ఉత్సాహంగా ఉట్టికొట్టే వేడుకలు



కొత్తపల్లిలో శ్రీకృష్ణుడిని ఆరాధిస్తున్న గోపికా వేషధారిణులు.. నూజివీడు త్రివిధ పాఠశాలలో ఉట్టికొట్టే సంబరం

నూజివీడు టౌన్, ఆగస్టు 26: కృష్ణాష్టమిని పురస్కరించుకొని నూజివీడు రుక్మిణి, సత్యభామ సమేత రాజగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పంచామృత అభిషేకం నిర్వహించి అనంతరం స్వామి వారిని పెళ్లి కుమారుడ్ని చేసినట్టు ఆలయ ప్రధాన అర్చకుడు గుడిపూడి రాఘవకుమార్ తెలిపారు. మంగళవారం శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. నూజివీడు త్రివిధ పాఠశాలలో చిన్నారులు గోపికా కృష్ణుల వేషధారణలో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు: ముసునూరు పడమట రామాలయంలో యాదవ యూత్ సభ్యులు పేరం సోమయ్య, మానికల గంగాధరరావు ఆధ్వర్యంలో అర్చకులు వేదాంతం సత్యనారాయణాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు, భక్తులు పెద్దయెత్తున స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు. అలాగే గోపవరం, చెక్కపల్లి, గోగులంపాడు, కాట్రేనిపాడు తదితర గ్రామాల్లో యాదవ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మేళతాళాలతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.

చాట్రాయి: ఆరుగొలనుపేట, జనార్ధనవరం తదితర గ్రామాల్లో కృష్ణుడి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. రాత్రి ఉట్టి ఉత్సవం కోలాహలంగా నిర్వహించారు. కృష్ణాష్టమి పందిళ్లలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కైకలూరు: మండలంలోని అన్ని వైష్ణవాలయాల్లో భక్తులు కృష్ణాష్టమి పూజలు చేశారు. కైకలూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కైకలూరు శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. గంగుల అశోక్ దంపతులు శ్రీకృష్ణునికి విశేష పూజలు నిర్వహించి ఊరేగించారు. అనంతరం శ్రీశ్యామలాంబ అమ్మవారి కళా మండపం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. సత్య సాయి సేవా సమితి, రామకృష్ణ సేవా సమితి, భుజ బలపట్నం లోని శ్రీకృష్ణ ఆలయంలో విశేష పూజలను నిర్వహించి ఉట్టి కొట్టారు. కైకలూరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, బోయిన రామకృష్ణ, బోయిన శ్రీనివాస రావు, బూరుబోయిన శ్రీనివాసరావు, గంగుల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడిని రథంపై మేళతాళాలు, కోలాటాలతో ఊరేగించారు. అనంతరం ఉట్టి కొట్టిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ మారుతీ ప్రసన్న, జడ్పీటీసీ మాజీ సభ్యురా లు నున్న రమాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ గోరిపర్తి సుబ్బారావు, బూరు బోయిన శ్రీనివాసరావు, యలవర్తి భవాని తదితరులు పాల్గొన్నారు. సానా రుద్రవరం శ్రీకృష్ణ మందిరంలో పూజలనంతరం స్వామివారి ఊరేగింపు, ఉట్టికొట్టే వేడుక నిర్వహించారు. సర్పంచ్ రాజేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ నున్న భగవాన్లు, ఎంపీటీసీ మహాలక్ష్మి, కృష్ణబాబు పాల్గొన్నారు. పెదలంక శ్రీకృష్ణుడి ఆలయంలోను స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉట్టి కొట్టిన వారికి బహుమతి ప్రదానం జరిగింది.


ముసునూరులో ప్రత్యేక అలంకరణలో శ్రీ కృష్ణుడు

మండవల్లి: మండలంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మందిరాల్లో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండవల్లి శ్రీకృష్ణ మందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవులను భారీ సంఖ్యలో మందిరానికి తరలించి పూజలు చేశారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం యువతీ యు వకుల కేరింతల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరి పారు. కానుకొల్లు వేణుగోపాల స్వామి ఆలయంలో జన్మాష్టమి వేడుకలు యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

ముదినేపల్లి: పేరూరులో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు కోలాహలంగా జరిగాయి. సంఘ అధ్యక్షుడు సోమా సత్య నారాయణ, నాయకుడు పెద్దిబోయిన రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపల్లి లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు పుష్పాల పూజిత, దీపిక, శావ్యశ్రీ గోపికల వేషధారణలతో స్వామివారిని ఆరాధించారు. విశ్వనాద్రి పాలెంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ఊరేగింపు జరిగింది.


చిన్నరావిచర్ల కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి సారథి, ఎంపీ మహేష్

శ్రీకృష్ణుడి ఆశీర్వాదంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

మంత్రి సారథి, ఎంపీ మహేష్ యాదవ్

నూజివీడు, ఆగస్టు 26: శ్రీకృష్ణుని ఆశీర్వాదంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖామంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ఆకాంక్షించారు. సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా చిన్న రావిచర్ల గ్రామంతో పాటు పలు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో వీరు పాల్గొన్నారు. చిన్నరావిచర్లలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బహుళజాతి పరిశ్రమలు మన రాష్ట్రానికి తరలివస్తున్నాయని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయన్నారు. అనంతరం ఆగిరిపల్లి, వడ్లమాను, దేవరగుంట, నూజివీడు పట్టణాల్లో జరిగిన జన్మాష్టమి వేడుకల్లో వీరు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.

నేడు చిన వెంకన్న క్షేత్రంలో శ్రీకృష్ణ జయంతి

ఆర్జిత కల్యాణం, ఆర్జిత సేవలు రద్దు 28న ఉట్ల పండుగ

ద్వారకాతిరుమల, ఆగస్టు 26: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీకృష్ణ జయంతి ఉత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో త్రినాథరావు తెలిపారు. అష్టమి మిగులు తిథితో పాటు రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగే ఈ ఉత్సవం నేపథ్యంలో స్వామివారికి నిత్యం నిర్వహించే ఆర్జిత కల్యాణం, నిత్యార్జిత సేవలను మంగళవారం రద్దు చేస్తున్నట్లు ఈవో వివరించారు. బుధవారం సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో ఉట్ల పండుగ, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కలిదిండి ఎస్ఐ బదిలీ

కలిదిండి, ఆగస్టు 26: కలిదిండి మండల ఎస్ఐగా పనిచేస్తున్న ప్రియకుమార్ రాజమహేంద్రవరం సమీపంలో ఉన్న బొమ్మూరు మండల ఎస్ఐగా సోమవారం బదిలీపై వెళ్లారు. ఇన్‌చార్జ్ ఎస్ఐగా మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు వ్యవహరిస్తున్నారు. కలిదిండికి నూతన ఎస్ఐగా మూడు రోజుల్లో రానున్నట్లు సమాచారం.

17 మంది హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

ఏలూరు క్రైం, ఆగస్టు 26 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లల్లో సీనియార్టీని బట్టి 17 మందికి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సివిల్)గా పదోన్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సీనియార్టీని బట్టి పదోన్నతి కల్పిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్ళు

పేరు (నెంబర్)	పని చేస్తున్న ప్రాంతం
ఎండీ రాజా అహ్మద్ (హెచ్‌సీ 69)	ద్వారకాతిరుమల పీఎస్, అటాచ్డ్ సీసీఎస్ ఏలూరు
ఎం హరిశ్చంద్ర ప్రసాద్ (హెచ్‌సీ 1715)	ఏలూరు టూటౌన్
ఏవీఎస్ నారాయణరాజు (హెచ్‌సీ 1728)	డీఎస్బీ ఏలూరు
కే నాగభూషణం (హెచ్‌సీ 1729)	తూర్పుగోదావరి జిల్లా
ఈ శ్రీనివాస్ (హెచ్‌సీ 1731)	పశ్చిమ గోదావరి
ఎం. భాస్కరరావు (హెచ్‌సీ 1732)	ఇంటెలిజెన్స్
కె. శేషగిరిరావు (హెచ్‌సీ 1734)	పశ్చిమ గోదావరి జిల్లా
పి. రాము (హెచ్‌సీ 1735)	డీసీఆర్బీ, ఏలూరు
ఎస్‌కే అమీర్ (హెచ్‌సీ 1736)	పెదవేగి పీఎస్ అటాచ్డ్ టు ద్వారకాతిరుమల పీఎస్
బి. ఏసు (హెచ్‌సీ 1737)	ఏలూరు టూటౌన్ పీఎస్ అటాచ్డ్ టు ఏలూరు త్రి టౌన్ పీఎస్
డి. వెంకటేశ్వరరావు (హెచ్‌సీ 1739)	ఇంటెలిజెన్స్
ఎన్ఎల్ నారాయణరావు (హెచ్‌సీ 1740)	డీటీసీ పెదవేగి
సీడీ గోవిందబాబు (హెచ్‌సీ 1162)	పశ్చిమ గోదావరి
ఎస్. శ్రీనివాసరెడ్డి (హెచ్‌సీ 1741)	పశ్చిమ గోదావరి
పి. రామకృష్ణ (హెచ్‌సీ 1743)	తూర్పుగోదావరి జిల్లా
ఎ. సత్యనారాయణ (హెచ్‌సీ 1745)	పశ్చిమ గోదావరి జిల్లా
సీహెచ్. సత్యనారాయణ (హెచ్‌సీ 1747)	పశ్చిమ గోదావరి జిల్లా

క్రైం సమాచారం


నిందితులను చూపుతున్న పోలీసులు

ఏటీఎంలో చోరీ యత్నం కేసులో...

అన్నదమ్ములే నిందితులు!

ముదినేపల్లి, ఆగస్టు 26 : ముదినేపల్లిలో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం చోరీకి యత్నించి పరారైన దుండగులను కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ పర్యవేక్షణలో ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, సిబ్బంది పట్టుకున్నారు. మండవల్లి మండలం పుట్ల చెరువు గ్రామానికి చెందిన సోదరులైన బెండి రామకృష్ణ, బెండి లక్ష్మీనారాయణలను సోమవారం ఉదయం ముదినేపల్లి - గుడివాడ ప్రధాన రహదారిలో కల్వపూడి సత్రం రోడ్డు వద్ద అరెస్టు చేసి చోరీకి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా ముందుంచారు. నిందితుడు రామకృష్ణ ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి సుమారు రూ. 3 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గంలేక ఏటీఎం చోరీని ఎంచుకుని, హైదరాబాద్‌లో ఉంటున్న తన అన్న లక్ష్మీనారాయణను రప్పించాడు. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి దాటాక లక్ష్మీనారాయణను ఏటీఎం బిల్డింగ్‌పై కాపలా పెట్టి రామకృష్ణ విద్యుత్ కనెక్షన్ తొలగించి ఏటీఎంను ధ్వంసం చేసి నగదు అపహరించేందుకు యత్నించిన సమయంలో అలారం మోగి పోలీసులు రావడంతో వారు పారిపోయారు. అప్పటి నుంచి వారి ఆచూకీ కోసం గాలించి సోమవారం అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. దుండగులను త్వరితగతిన పట్టుకోవటంలో నైపుణ్యం చూపించిన ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, కానిస్టేబుల్ బి.నాగబాబును ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, డీఎస్పీ శ్రావణ్ కుమార్ అభినందించారు.

మట్టగుంటలో దాహం.. దాహం..


మట్టగుంటలో కలుషిత తాగునీటి చెరువు

- తాగునీటి చెరువు కలుషితం.. వాడకానికీ పనిచేయవు!
- పట్టించుకోని అధికారులు.. అల్లాడుతున్న గ్రామస్తులు

కలిదిండి, ఆగస్టు 26 : మండలంలోని మట్టగుంట తాగునీటి చెరువు నీరు కలుషితమైంది. చెరువు నీరు తీవ్ర దుర్వాసన వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. చెరువు నీరు ఉప్పగా ఉండటంతో వాడుకోవటానికి కూడా ఉపయోగ పడటం లేదని స్నానం చేస్తే దురదలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు నీరు ఉప్పగా ఉంటుందని తాగటానికి ఆమోద యోగ్యంగా లేకపోవటంతో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లలో తాగునీరు కొనుగోలు చేసి తాగుతున్నామని వాపోతున్నారు. ఆర్థిక స్తోమత లేని పేదలు, వృద్ధులు కలుషిత నీరుతాగి రోగాల బారిన పడుతున్నారు. తాగునీటి చెరువు కలుషితమైనప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. వాడుకోవటానికి కూడా చెరువు నీరు ఉపయోగకపడక పోవటంతో నరకయాతన అనుభవిస్తున్నామన్నారు. చెరువులో కలుషిత నీరు తొలగించి తాజా తాగునీరు పెట్టాలని కాల్వలకు నీరు విడుదల చేయగానే ప్రాధాన్యమిచ్చి చెరువును పూర్తి స్థాయిలో నింపాలని సంబంధిత ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు.

సర్పంచ్, కార్యదర్శి ఏమన్నారంటే..

ఈ విషయమై సర్పంచ్ అంద్రాజు రత్నమణి, పంచాయతీ కార్యదర్శి నాగబాబును వివరణ కోరగా, చెరువులో కలుషిత నీరును పూర్తిగా తొలగించి తాజా తాగునీరు పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి వంతు రెండు రోజుల్లో ఇస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారని, తాగునీటి వంతు ఇవ్వగానే తాజా తాగునీటితో పూర్తి స్థాయిలో చెరువును నింపుతా మన్నారు.


థెరిసా విగ్రహానికి పూలమాల వేసి టీడీపీ నేతల నివాళి

మదర్ థెరిసా సేవలు మహోన్నతం

కైకలూరు ఆగస్టు 26: మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా కైకలూరు కోరుకొల్లు రోడ్డులోని థెరిసా విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు మాట్లాడుతూ థెరిసా సేవలు మహోన్నతమైనవని, నేటి యువతకు థెరిసా ఆశయాలను వివరించి సేవ పట్ల అంకితభావంతో పనిచేసేలా చూడాలన్నారు. టీడీపీ నాయకులు వీరాబత్తిన సుధా, ఈదా వెంకటస్వామి, గఫూర్ ఖాన్, రసూల్ ఖాన్, హబీబ్, పల్లెం ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.


ముదినేపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏకీకృత పెన్షన్ స్కీం వద్దు : ఏపీటీఎఫ్

ముదినేపల్లి, ఆగస్టు 26 : కేంద్రం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీం ఆమోద యోగ్యం కాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు స్పష్టం చేశారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్, జిల్లా కౌన్సిలర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, ముదినేపల్లి మండల అధ్యక్షుడు కృపాకర్, ప్రధాన కార్యదర్శి డి.వెంకటరత్నం సోమవారం విలేకరులతో మాట్లాడు తూ ఏళ్ల తరబడి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇష్టం లేని ఏకీకృత పెన్షన్ స్కీంను అమలు చేయాలని కేంద్రం యత్నించటం దారుణమని విమ ర్శించారు. ఇదే స్కీమ్‌ను అమలు చేయాలని రాష్ట్రాలకు సూచించటాన్ని ఉపా ధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. పాత పెన్షన్ స్కీం ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ ఫండ్ అండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీని రద్దు చేయాలని, జీతం నుంచి పది శాతం తగ్గింపును నిలిపేయాలని డిమాండ్ చేశారు. సమాఖ్య నాయకులు బండి జాన్సన్ బాబు, రెడ్డి శ్రీనివాసరావు, రమేష్, హరిబాబు, అప్పారావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం



ముదినేపల్లి, ఆగస్టు 26 : మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. సోమవారం స్వామివారి జన్మనక్షత్రమైన కృత్తిక సందర్భంగా జరిగిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మాస కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పూజలు జరిపారు. పవిత్ర జలాలతో సంప్రోక్షణ, మహాపూర్ణాహుతిని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సంధ్య పర్యవేక్షణలో నిర్వహించారు. ఆలయం వద్ద పుట్టలో పాలుపోసి భక్తులు పూజలు జరిపారు.

30న వరలక్ష్మీ వ్రతాలు

ఈ నెల 30న ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ సంధ్య తెలిపారు. వ్రతాల్లో పాల్గొనే మహిళలు తమ పేర్లను నమోదు చేయించుకుని, పూజా సామాగ్రి తెచ్చుకోవాలని తెలిపారు.



కృష్ణ మందిర ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి, ఆగస్టు 26 : మండలంలోని అల్లూరులో శ్రీకృష్ణ మందిరం ప్రతిష్ఠోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 28న విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా యాగశాలలో హోమాలను నిర్వహించి పూజలు జరిపారు. యాజ్ఞికుడు ఆముదాలపల్లికి చెందిన సోమరాజుపల్లి ఈశ్వర నాగ కుమార శర్మ, పలువురు అర్చకులు గోపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

14 నెలలుగా జీతాల్లేవ్!

హాస్టల్ ట్యూటర్ల ఆవేదన



ముదినేపల్లి, ఆగస్టు 26 : ప్రభుత్వ వసతి గృహాల్లోని ట్యూటర్లకు గత 14 నెలలుగా జీతాలు అందటం లేదు. 2023 ఏప్రిల్ నుంచి ట్యూటర్ల జీతాల బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేయకపోవటంతో ట్యూటర్లకు జీతాలందడం లేదు. పదో తరగతి వరకు విద్యార్థులున్న వసతిగృహాల్లో సబ్జెక్టుకు నెలకు రూ.1500 జీతామిచ్చే విధంగా ప్రభుత్వం ట్యూటర్లను ఏర్పాటు చేసింది. బీసీ వెల్ఫేర్ వసతి గృహాల్లోని ట్యూటర్లకు ఎక్కువ నెలల జీతాలు పెండింగ్‌లో ఉండగా, సోషల్ వెల్ఫేర్ వసతి గృహాల్లోని ట్యూటర్లకు నాలుగు నెలల జీతాలు రావాల్సి ఉంది. సంవత్సరం పైబడి వీరి జీతాల బిల్లులకు మోక్షం కలగటం లేదు. కైకలూరు నియోజకవర్గంలోని 4 మండలాల్లో 8 మంది ట్యూటర్లకు రూ. 3.36 లక్షలు జీతం బకాయిలు రావలసి ఉంది. 2023 బడ్జెట్‌లో ట్యూటర్ల జీతాల చెల్లింపునకు అప్పటి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించకపోవటంతో వీరికి జీతాలందని పరిస్థితి ఏర్పడింది. ట్యూటర్ల జీతాలకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కావాల్సి ఉందని సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు.

గుడి వెనుక ఆగడాలు

- మందుబాబుల హల్‌చల్..
- పలువురు హైస్కూల్ విద్యార్థుల స్మోకింగ్, గంజాయి సేవనం!

ఆగిరిపల్లి, ఆగస్టు 26: ఆగిరిపల్లి శోభనాచల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ప్రధాన ఆలయం వెనుక ఖాళీ స్థలంలో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. ప్రతిరోజూ ఖాళీ మందు సీసాలు ఉంటున్నాయని, వీరికి తోడు హైస్కూల్ విద్యార్థులు కూడా వచ్చి సిగరెట్లు తాగటం, గంజాయికి అలవాటు పడుతున్నారని, ఆలయ భద్రతపై పోలీసులతో బీట్ వేయించమని ఆలయ ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు పోలీస్‌లను సంప్రదించగా స్టేషన్లో సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల పంపలేకపోతున్నామని తెలిపారన్నారు. విద్యార్థి స్థాయి నుంచి పిల్లలు పెడదోవ పట్టడానికి ఆలయం వెనుక భాగం అడ్డాగా మారుతోందని కొండపై నివాసం ఉండే వ్యక్తులు గంజాయి వ్యాపారం చేస్తూ గంజాయి అమ్మటానికి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని వీరిని అదుపు చేయకపోతే విద్యార్థుల జీవితం నాశనం అవుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. గంజాయి ఆగిరిపల్లిలో కూడా అమ్ముతున్నారని పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

చాట్రాయిలో డ్రెయిన్ల పూడికతీత



చాట్రాయి, ఆగస్టు 26: చాట్రాయి సొసైటీ ఏరియాలో పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం డ్రెయిన్ల పూడిక తీత పనులు చేపట్టారు. డ్రెయిన్లలో పూడిక పేరుకుపోవటం వల్ల వర్షం నీరు, ఇళ్లలో వాడిన మురుగునీరు నివాస ప్రాంతాల్లో నిలిచిపోయి దోమలు పెరిగి జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎట్టకేలకు డ్రెయిన్లు పూడికతీయటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, దోమ తెరలు వాడాలని, జ్వర లక్షణాలు కనిపిస్తే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స చేయించుకోవాలని ప్రజలకు పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వైద్య సిబ్బంది విజ్ఞప్తి చేశారు.



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 మంది ఎంపిక

నూజివీడు, ఆగస్టు 26: నూజివీడు డాక్టర్ ఎమ్మార్ అప్పారావు పీజీ సెంటర్‌లో సోమవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో దివీస్ లేబొరేటరీస్ సహకారంతో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. పీజీ సెంటర్, కృష్ణా వర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు రాతపరీక్ష, ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. పీజీ, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్, ఐటీఐ అర్హతలు కలిగిన వారు 120 మంది హాజరు కాగా 50 మందిని మెరిట్ ప్రకారం ఎంపిక చేసినట్లు దివీస్ సంస్థ హెచ్‌ఆర్ మేనేజరు కావూరి రామకృష్ణ తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయ రెక్టార్, రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య మండవ వెంకట బసవేశ్వరరావు, రసాయన శాస్త్ర విభాగ కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ డి.రవికుమార్, నూజివీడు పీజీ కేంద్రం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వర్ధన్ తదితర అధికారులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న దృశ్యం

హెల్పింగ్ హ్యాండ్స్ వార్షికోత్సవం

నూజివీడు టౌన్, ఆగస్టు 26: విద్యార్థుల సహకారంతో ఏర్పడిన నూజివీడు ట్రిపుల్ ఐటీ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ 15వ వార్షికోత్సవాన్ని ట్రిపుల్ ఐటీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు ఎ.బ్రహ్మస్వాములు, కార్యదర్శులు జె.మధు, డాక్టర్ సలీంబాబు, వేణుగోపాల్ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ట్రిపుల్ ఐటీ ఏర్పాటు నుంచి ఒక్కొక్క విద్యార్థి ఒక్కొక్క రూపాయి విరాళంగా ఇవ్వడం ద్వారా సంస్థ సేవా కార్యక్రమాలకు తోడ్పడుతోందన్నారు.

మెరుగైన యాజమాన్య పద్ధతులతో లాభాలు


మాట్లాడుతున్న ఏవో చాముండేశ్వరి

నూజివీడు టౌన్, ఆగస్టు 26: మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో ఆలూరి చాముండేశ్వరి అన్నారు. బత్తులవారి గూడెంలో పొలంబడి కార్యక్రమంలో ఆమె రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ అధిక దిగుబడులను సాధించవచ్చని చెప్పారు. ఎరలను ఏర్పాటు చేయడం ద్వారా పురుగుల ఉధృతిని గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.